## క్లుప్తంగా

### వైదనలో నేడు రైతులకు రుణమేళా

**బల్లికురవ:** మండలంలోని వైదన రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ఉదయం 10 గంటల నుంచి పాడి రైతులకు గేదెల కొనుగోలుకు రుణమేళ నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు మేడా శివదుర్గా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి పశువుల పెంపకానికి కో ఆపరేటివ్ బ్యాంకు ద్వారా అందజేస్తామని చెప్పారు. కావాల్సిన రైతులు ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, కో ఆపరేటివ్ బ్యాంకు ఖాతా పుస్తకంతో మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఖాతా లేనివారికి కూడా అక్కడికక్కడే ప్రారంభిస్తామని, రుణం తీసుకున్న రైతులు అమూల్ పాల కేంద్రానికి ప్రతిరోజు పాలు పోయాలని సర్పంచ్ వివరించారు.

### పండ్లతోటల పెంపకంతో లాభాలు

**చీరాల టౌన్:** రైతులు పండ్ల తోటలను పెంపకాలను చేసుకోవడం వలన వృద్ధి చెందుతారని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం దాసు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటల పెంపకాలకు కావాల్సిన సమాచారం మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల ఫీల్డు అసిస్టెంట్ల వద్ద ఉందని, గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్నకార రైతులు, ఎస్సీ, ఎస్టీలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పండ్లతోటల పెంపకంలో మామిడి, సపోట, జామ, సీతాఫలం, జీడిమామిడి పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. పండ్ల తోటల పెంపకాలు చేయాలనుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలతో ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఏపీవో దాసు సూచించారు.

### ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం

**మేదరమెట్ల:** మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు అద్దాలు పగులగొట్టాడు ఆటో డ్రైవర్. ఈఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ ఎస్సీ కాలనీ వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వినుకొండ డిపోకు చెందిన బస్సు బెంగళూరుకు వెళ్తుండగా తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ ఎస్సీ కాలనీ వద్దకు రాగానే ఆటోను అడ్డదిడ్డంగా బస్సుకు ఎదురొచ్చాడు. దీంతో బస్ డ్రైవర్ ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆటో డ్రైవర్ బంధువుల సహకారంతో ఆర్టీసీ బస్సుపై, డ్రైవర్‌పై దాడికి యత్నించి బస్సు అద్దాలు పగులగొట్టారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పీఎం సురక్ష బీమా చెల్లింపు



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న అధికారులు

**మార్టూరు:** ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద లబ్ధిదారులకు వలపర్ల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ బీ హేమలత శుక్రవారం రూ.2 లక్షల నగదు చెల్లించారు. బ్యాంకు ఖాతాదారు పత్తిపాటి వేణు విద్యుదాఘాతంతో మరణించిన కారణంగా నామినీ అయిన వేణు భార్య మల్లికకు ప్రమాద బీమా నగదు అందించినట్లు మేనేజర్ తెలిపారు. ఖాతాదారు కేవలం రూ.20 ప్రీమియం చెల్లించటం ద్వారా 70 ఏళ్లలోపు మరణించిన వారికి రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, అందరూ వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శేషారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అద్దంకి: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పంగులూరు భీమలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు



కారంచేడులో అలంకరణలో గ్రామ దేవత గంగమ్మతల్లి



గన్నవరంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చెన్నుపలిల్లో ప్రత్యేక వేదికపై పూజలందుకుంటున్న అమ్మవారు



మార్టూరు దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారు



చినగంజాంలో పూజలు నిర్వహిస్తున్న మహిళ

# వరాల తల్లీ మమ్మేలవమ్మా..

- ఇంట్లో కొలువై ఉన్న వరలక్ష్మీ అమ్మవారు
- వరలక్ష్మీ వ్రతంతో అష్టైశ్వర్యాలు
- కిటకిటలాడిన ఆలయాలు

**బల్లికురవ/అద్దంకి/అద్దంకి రూరల్/జే పంగులూరు:** శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం భారతీయ హిందువుల సంప్రదాయ ఆచారంగా వస్తున్నది. వరలక్ష్మీ దేవత శ్రీ మహావిష్ణుమూర్తి భార్య. శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రవణం పేరుతో వచ్చే మాసం శ్రావణం. చాంద్రమాన ప్రకారం తెలుగు సంవత్సరాదిలో ఐదో నెల శ్రావణం. ఈ నెలలో నోములు, వ్రతాలు, పూజలకు ప్రశస్తి. ఈ పండగ ముత్తైదువలకు ఎంతో విశిష్టమైనది. శ్రావణ మాసానికి ఎంతో విశిష్టత ఉందని చెన్నుపల్లి గంగాపార్వతీ సమేత పరుసవేదిశ్వరస్వామిల ఆలయ ప్రధాన అర్చకుడు పీ. సుబ్రమమణ్యశర్మ అన్నారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి బృందాలుగా వరలక్ష్మీ వ్రతాలు చేయించారు. ఈమాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని చరిస్తే అష్టైశ్వర్యాల తోపాటు సౌభాగ్యం, మాంగల్యబలం చేకూరుతుందని అన్నారు. వ్రతాల్లో పాల్గొన్న మహిళల చేత కలశం ఏర్పాటుతో కుంకుమ పూజలు చేయించారు. అమ్మవారికి నివేదించిన తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. బల్లికురవ మండలంలో వాడవాడలా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు వాయన దానాలు, ముత్తేదువులకు పండు, పసుపు కుంకుమలతో ఆశీర్వచనం పొందారు.

■ జే.పంగులూరు మండలంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మండల పరిధిలోని పంగులూరు భీమలింగేశ్వర స్వామివారి దేవాలయం, కొండమూరు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవాలయంలో అమ్మవారి వరలక్ష్మీ వ్రతం ఎంతో ఘనంగా నిర్వహించారు.

■ కొరిశపాడు మండలంలోని పలు గ్రామాలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం చేసుకున్నారు. మహిళల సౌభాగ్యాలు, మాంగల్యం బలంచేకూరాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వెంకన్న సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు..**

**కారంచేడు/చినగంజాం/యద్దనపూడి:** శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని పలు దేవాలయాల్లోను, గృహాల్లోను సామూహిక వరలక్ష్మీ వ్రతాలు కన్నుల పండువగా నిర్వహించారు. కారంచేడు పెదబజారు శివాలయం, గ్రామ దేవత గంగమ్మ గుడి, వైష్ణవీ దుర్గాలయం, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం, సాయి మందిరం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, శివాలయంలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లో పలు గృహాల్లోను అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చేసుకున్నారు. స్వర్ణ వెంకన్న సన్నిధిలో సుమారు 200 మంది మహిళలు సామూహిక ముత్తైదువుల వ్రతాన్ని ఆచరించారు. ఏపీఎస్ బ్రదర్స్ బక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

■ యద్దనపూడి మండలం పూనూరు త్రిపురాంతక స్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వరస్వామి, చింతపల్లిపాడు భూ సమేత చెన్నకేశవస్వామి, పోలూరు చెన్నుమల్లికార్జున స్వామి వార్ల ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

■ చినగంజాం మండలంలోని భావన్నారాయణ స్వామి, కన్యకాపరమేశ్వరీ మందిరంతో పాటు పలు దేవాలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ మార్టూరు, రాజుపాలెం, కోలలపూడి, వలపర్ల, ఇసుకదర్శి తదితర గ్రామాల్లోని ఆలయాలలో ఉదయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. స్థానిక దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో స్థానికులు పూజలు నిర్వహించగా పూజారి సురేష్ కుమార్ వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.

**చీరాల అర్బన్:** శ్రావణమాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలను పట్టణ, గ్రామాల్లోని దేవాలయాలు, నివాస గృహాల్లో ఘనంగా నిర్వహించారు. వరాలిచ్చే వరలక్ష్మీ మమ్ములను చల్లగా దీవించు అంటూ భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. పట్టణంలోని చీరాల శివాలయం, పేరాలలోని మదనగోపాలస్వామి దేవాలయంలో, బస్టాండ్ వద్ద గల శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేయగా ఏర్పాట్లును దేవస్థానాల కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



చెన్నుపల్లిలో వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



స్వర్ణ వెంకన్న సన్నిధిలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



మేదరమెట్లలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

## లోతట్టు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

**కారంచేడు:** గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు నాగయ్యగారి రైస్ మిల్లు సమీపంలో మురుగు, ముంపు ప్రాంతాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామ పంచాయతీ వెనుక వైపున వున్న రెండు చెరువులకు సంబంధించిన ఔట్ లెట్ నిర్మాణంలో నీటి ప్రవాహానికి వీలు లేకపోవడం, నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో పూడిక తీయడం కష్టమవుతున్న విషయాన్ని స్థానికులు ఆమంచి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన చెరువు ఔట్‌లెట్ ప్రాంతాన్ని పరిశీలించి ఇబ్బందిగా మారిన సుమారు 50 మీటర్ల వరకు నిర్మాణాన్ని పగులగొట్టి మురుగు పోవడానికి వీలుగా ఉండేలా మరలా నూతన నిర్మాణం చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చెయ్యాలన్నారు. అలాగే ముస్లిం కాలనీ నుంచి శ్మశాన వాటికకు వెళ్లే రహదారికి అనుకూలంగా సీసీ నిర్మాణం చేపట్టాలని కాలనీ మహిళలు కోరారు. దీనిపై ఆయన వెంటనే ప్రతిపాదనలు తయారు చెయ్యాలని పీఆర్ జేఈ రామచంద్రుడికి సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ అత్యవసర నిధుల నుంచి ఔట్‌లెట్ నిర్మాణ పనులకు సుమారు రూ.11 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సుమారు రూ.5 లక్షలను మంజూరు చేస్తామని ఆయన అక్కడ ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో వారు ఆమంచికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్ర, ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, పీఆర్ జేఈ రామచంద్రుడు, కారంచేడు పంచాయతీ కార్యదర్శి అంజయ్య, యార్లగడ్డ శ్రీకాంత్, యార్లగడ్డ పాపారావు, గర్నెపూడి ప్రసాద్, వెంపరాల సుబ్బరాయుడు, యార్లగడ్డ కోటయ్య, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమస్యలపై మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్

## సుపరిపాలన జగనన్నతోనే సాధ్యం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

**సంతమాగులూరు (అద్దంకి రూరల్):** సుపరిపాలన జగనన్నతోనే సాధ్యమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ బుక్‌లెట్‌ను అందజేస్తూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలన దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సుపరిపాలనతో ప్రజల మనస్సుల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రాబోయో ఎన్నికలో జగనన్న మళ్లీ సీయంను చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ విజయం కోసం కృషిచేయాలి

**పర్చూరు (చినగంజాం):** రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం పర్చూరు పార్టీ కార్యాలయంలో టీం జగనన్న యాప్‌లో నియోజకవర్గ టాప్ యూజర్లను ఆమంచి సత్కరించి ప్రశంస పత్రాలు అందించారు. ఇందులో భాగంగా దాలిపర్తి రవి, జక్కిరెడ్డి సాయిరెడ్డి, కాలవ అఖిల్, గోగుమల్ల వినోద్ కుమార్, గర్నెపూడి రవిచంద్‌లను ఆయన సత్కరించారు.



టాప్ యూజర్లను అభినందిస్తున్న ఆమంచి

### జిల్లా కమిటీలో చీరాల నేతలకు చోటు

**చీరాల:** వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా నూతన కమిటీలో చీరాల నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మందికి చోటు దక్కింది. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. వేటపాలెం మండలానికి చెందిన రొండా భరత్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పదవిని పొందారు. అలానే చీరాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శిఖా సురేష్, బండారు శివపార్వతిలను కార్యదర్శులుగా, పులి వెంకటేశ్వరరావు, దంతం హనుమంతరావు, గుంటూరు మాధవరావు, ఆవుల వెంకటేష్, కంకణాల ఆనంద్‌కుమార్‌లను కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. జిల్లా కమిటీలో తమకు చోటు కల్పించినందుకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## 70 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

**చీరాల టౌన్:** ఎవరెన్నిసార్లు దాడులు చేసిన రేషన్ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆపడం లేదు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో సిద్ధహస్తుడు పేరాలకు చెందిన నాగుల్ మీరా యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని జిల్లాలు దాటిస్తున్నాడు. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణాను ఆపడం లేదు. శుక్రవారం చీరాల రూరల్ ఎస్సై పి.జనార్దన్ వాహనాల తనిఖీ చేస్తుండగా ఈపురుపాలెం–సావరపాలెం దరివాడ రోడ్డులోని శేఖర్ పుట్ట సమీపంలో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 70 బస్తాల రేషన్‌బియ్యాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రూరల్ ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల మేరకు.. ఈపురుపాలెంలోని రేషన్ డీలర్ కాశీ వద్ద నుంచి 70 బస్తాలు (36 క్వింటాళ్లు) బియ్యాన్ని నిల్వచేసి వ్యాన్‌లో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ మార్గంలో వాహనాలు తనిఖీ చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ వాకా గోపిరాజు, డీలర్ కాశీ, ప్రధాన సూత్రధారి నాగుల్ మీరా, సుంకర శివలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. ఈపురుపాలెం డీలర్ నుంచి సేకరించిన బియ్యాన్ని స్వర్ణ రోడ్డులో తమకు అప్పగించాలని నాగుల్ మీరా చెప్పాడని డ్రైవర్ గోపిరాజు పోలీసులకు తెలిపారు.



బియ్యం వ్యాన్‌ను పరిశీలిస్తున్న ఎస్సై జనార్దన్, సిబ్బంది

## ముగిసిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

**చినగంజాం:** కుక్కల సాయిరాంరెడ్డి, కుక్కల రామిరెడ్డి మెమోరియల్ జ్ఞాపకార్థం నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిశాయి. శుక్రవారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందించారు. మొదటి బహుమతి కోమట్ల అంకమ్మరెడ్డి యువసేన గెలుపొందగా కోమట్ల అంకమ్మరెడ్డి రూ.20116, రెండో బహుమతి చీరాల కోటిరెడ్డి ఫ్రెండ్స్ గెలుపొందగా నగదు బహుమతి రూ.16,116లు మున్నం గోవర్ధన్ రెడ్డి, మూడో బహుమతి మున్న ఫ్రెండ్స్ గెలుపొందగా రూ.12,116 మారుబోయిన నాగిరెడ్డి, నాలుగో బహుమతి కుక్కల సాయిరాంరెడ్డి మెమోరియల్ గెలుపొందగా రూ.10,116 కోకి అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం కుమారులు కోకి వెంకటేశ్వరరెడ్డి, ఐదో బహుమతి వీవీఎస్ ఫ్రెండ్స్ రూ.8116 ఆసోది సురేష్‌రెడ్డి (జిమ్), ఆరో బహుమతి లక్ష్మారెడ్డి మెమోరియల్ గెలుపొందగా రూ.6116 షేక్ గౌస్ బాషా జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం రాంబాబు, మున్నం నాగాంజనేయ రెడ్డి, ఇసూబ్, సుభాని, కే ఏడుకొండలు రెడ్డి, కే పవన్‌రెడ్డి, ఎం గోవర్ధన్ రెడ్డి, కే గోపిరెడ్డి, కే శివరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి, బ్రహ్మానందరెడ్డి

### ఓట్ల తొలగింపుపై విచారణ

**బల్లికురవ:** గ్రామాలవారీగా చనిపోయిన వారిని డబుల్ ఎంట్రీలను ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలని తహశీల్దార్ కే రవిబాబు కోరారు. శుక్రవారం మండలంలోని వైదన, కొమ్మినేని వారి పాలెం గ్రామాల్లో ఫారం–7 తొలగింపులపై ఇంటింటా విచారణ చేపట్టారు. ఓటర్ల జాబితాల్లో లోపాలు తలెత్తకుండా ఫారం 6, 7, 8 చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతి యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. వీఆర్‌వోలు వీరాంజనేయులు, విమల్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

**చినగంజాం:** బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓట్లను త్వరితగతిన పరిశీలన పూర్తి చేసి వెంటనే నివేదిక అందించాలని తహశీల్దార్ పీ పార్వతి అన్నారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు.

### సీసీఆర్‌సీ కార్డులతో ఉపయోగాలు

**వేటపాలెం:** వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలను సీసీఆర్‌సీ కార్డు కలిగిన కౌలు రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎగ్రాయం సూచించారు. మండల పరిధిలోని చల్లారెడ్డి పాలెం-1 రైతు భరోసా కేంద్రం పరిదిలో వేరుశనగ పంట సాగుపై రైతులకు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. రైతులకు విత్తనశుద్ధి నిర్వహించే పద్ధతిని వివరించారు. వేరుశనగ పంట సాగులో మెళుకువలు, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. పంటలో చీడపీడ, పురుగుల నిర్మూలనకు ఉపయోగించే లింగాకర్షక బట్టల ఏర్పాటు ఉపయోగాల గురించి రైతులుకు తెలియజేశారు. వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఏఏటీ సెంటర్ సీనియర్ శాస్త్ర వేత్త ఓబయ్య, ఎఫ్‌టీసీ డీఏటీ సెంటర్ విజయనిర్మల, మండల వ్యవసాయ సలహా కమిటి చైర్మన్ పీ శ్రీనివాసరావు, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, బీ కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ పంచాంగం అందిస్తున్న అధికారులు

### బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**బల్లికురవ:** పని నిమిత్తం వెళ్లి స్వగ్రామం వస్తుండగా గేదె అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని కొప్పెరపాడు.. వినుకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డులోని కూకట్లపల్లి ఆర్చి సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జెండారాజుపల్లి పిలుపు బైకుపై నాగులవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

### రేపు షుగర్ వైద్య శిబిరం

**చీరాల టౌన్:** మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతిస్వామి వారి ఆశ్రమంలో ఈనెల 27 ఆదివారం ఉచిత మెగా షుగరు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆశ్రమం మేనేజర్ ఎస్.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేనేజర్ మాట్లాడుతూ బాపట్ల, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఉన్న వేలాది మంది రోగులకు కొన్నేళ్లుగా ఉచితంగా శిబిరాన్ని నిర్వహించామన్నారు. గతంలో పరీక్షలు చేయించుకున్న రోగులు రిపోర్టులతో శిబిరానికి హాజరై ఉచితంగా సేవలు పొందాలని సూచించారు.

### రైలు నుంచి జారిపడి..

**చీరాల అర్బన్:** రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలైన ఘటన శుక్రవారం పాతచీరాల గేటు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా కారిపల్లె మండలం ఇల్లందు గ్రామానికి చెందిన కె.నరేష్ బేల్దారి పనులు చేస్తుంటాడు. పని నిమిత్తం ఒంగోలు వచ్చిన తిరిగి గురువారం రాత్రి ఒంగోలులో ఖమ్మం వెళ్లేందుకు పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. గేటు వద్ద కూర్చొన్న నరేష్ నిద్రమత్తులో పాతచీరాల గేటు వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడ్డాడు. శుక్రవారం తెల్లవారు జామున రక్త గాయాలతో పడి ఉన్న అతడిని స్థానికులు చూసి 108 లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు క్షతగాత్రుడి వద్ద నుంచి వివరాలను నమోదు చేశారు.